క్లుప్తంగా

మిర్యాల సంత వేలం


వేలం పాట నిర్వహిస్తున్న అధికారులు

నూతనకల్ : మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో ప్రతి ఆదివారం నిర్వహించే వార సంతకు ఎంపీడీఓ పి. సునీత ఆధ్వర్యంలో గురువారం వేలం పాట నిర్వహించారు. ఎంపీడీఓ తెలిపిన వివరాల ప్రకారం.. వేలంపాటలో 12మంది రూ. 2లక్షల చొప్పున డిపాజిట్ చేసి వేలంలో పాల్గొనగా గ్రామానికి చెందిన వేల్పుల లింగయ్య రూ. 9లక్షల 6వేలకు వేలంను దక్కించుకున్నారు. వేలం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తుంగతుర్తి సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతనకల్, మద్దిరాల, తుంగతుర్తి ఎస్ఐలు జూకూరి సైదులు, మధునాయుడు, ఏడుకొండలు భారీ బందోబస్తు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, పంచాయతీ కార్యదర్శి అనిల్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు తుంగతుర్తి సంత వేలం

తుంగతుర్తి : తుంగతుర్తిలో ప్రతి సోమవారం జరిగే సంతకు ఈ నెల 15న వేలం పాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి భీమా రెడ్డి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. సంత వేలంలో పాల్గొనే వారు ఈనెల 15న ఉదయం 10గంటల వరకు డిపాజిట్ రూ.1లక్ష నగదు చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

పాదయాత్రకు స్వాగతం


తిమ్మాపురం వద్ద బీఆర్ఎస్ నాయకులకు స్వాగతం పలుకుతున్న వైస్ ఎంపీపీ

అర్వపల్లి : సూర్యాపేట ఎమ్మెల్యేగా మూడోసారి జగదీష్‌రెడ్డి విజయం సాధించడాన్ని పురస్కరించుకొని అతడి అభిమానులు, బీఆర్ఎస్ నాయకులు మొక్కులు చెల్లించుకోవడానికి సూర్యాపేట నుంచి యాదాద్రికి చేపట్టిన పాదయాత్ర గురువారం తిమ్మాపురం గ్రామానికి చేరింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ మారిపెద్ది భవాని శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మారిపెద్ది శ్రీనివావాస్‌గౌడ్ వారికి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో మంత్రి జగదీష్‌రెడ్డి తండ్రి, స్వాతంత్ర్య సమరయోధుడు గుంటకండ్ల రామచంద్రారెడ్డి, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కందుల దశరథరామారావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చివ్వెంల : మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల మినీ గురుకులంలో 2024–25 విద్యా సంవత్సరానికి గాను ఒకటవ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని నల్లగొండ రిజినల్ కోఆర్డినేటర్ కె.సుధాక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత మండలానికి చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒకటవ తరగతిలో 30 సీట్లు, 5వతరగతిలో 9 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గలవారు ఆధార్ కార్డు, పాస్ ఫొటోలు, కుల, ఆధాయ ధ్రువీకరణ పత్రాలతో సంబంధిత పాఠశాలలో ఈనెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 21వ తేదీన లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు.

హెచ్‌ఎంల బాధ్యతల స్వీకరణ


హెచ్‌ఎంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలంలోని వివిధ గ్రామాల జెడ్పీహెచ్ఎస్‌లకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు నియమితులయ్యారు. అర్వపల్లి జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా ఎం. విజయలక్ష్మి, తిమ్మాపురం పాఠశాల హెచ్‌ఎంగా కె. ప్రభాకర్, పర్సాయపల్లి పాఠశాల హెచ్‌ఎంగా జి.గోవర్ధన్‌రెడ్డి, కొమ్మాల పాఠశాల హెచ్‌ఎంగా బి.శేఖర్, కాసర్లపహాడ్ జెడ్పీహెచ్ఎస్ హెచ్‌ఎంగా పి.నర్సింహాచారి గురువారం బాధ్యతలు స్వీకరించారు. వారిని ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు సన్మానించారు.

తిరుమలగిరిలో వర్షం


తిరుమలగిరిలో కురుస్తున్న వర్షం

తిరుమలగిరి : తిరుమలగిరి మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో గురువారం వర్షం కురిసింది. గత వారం రోజులుగా ఎండలు తీవ్రంగా కొడుతుండటంతో విత్తనాలు మొలుస్తాయో లేదో అనే సందేహంలో ఉన్న రైతులు వర్షం కురియడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోని పలు కాలనీలు జలమయమయ్యాయి.

బడుల్లో సమస్యలను పట్టించుకోరూ..

- పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిరుపయోగంగా మారిన మూత్రశాలలు, మరుగుదొడ్లు
- స్కావెంజర్లు లేకపోవడంతో పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ప్రతి ఏటా ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు


మరుగుదొడ్ల సమస్యను పరిష్కరించాలని ఎంఈఓకు వినతిపత్రం ఇస్తున్న విద్యార్థులు(ఫైల్)

ఆత్మకూర్(ఎస్) : మండల వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు లేక ప్రతి ఏడాది విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. తమకు సరైన వసతులు కల్పించాలని విద్యార్థులు ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు అనేకమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకుండా పోతుంది. ప్రధానంగా మండల వ్యాప్తంగా ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్ల సమస్య తీవ్రంగా ఉంది. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం మండలంలోని 20 పాఠశాలలను మన ఊరు – మనబడి పథకం కింద ఎంపిక చేసి వసతులు కల్పించడానికి నిధులు కేటాయించింది. అయినప్పటికీ పూర్తిస్థాయిలో ఎక్కడా పనులు జరగలేదు. ప్రధానంగా ఉన్నత పాఠశాలల్లో మరుగుదొడ్ల సౌకర్యం లేక విద్యార్థినులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు ఉన్నప్పటికీ నీటి వసతి ఉండడం లేదు. అలాగే స్కావెంజర్లు లేక వాటిని ఉపయోగించుకునే పరిస్థితి లేదు. దీంతో విద్యార్థినులు పాఠశాలలకు వెళ్లాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వస్తుందని తల్లిదండ్రులు అంటున్నారు. మండల వ్యాప్తంగా మన ఊరు –మన బడిలో భాగంగా గత విద్యా సంవత్సరంలో కొన్ని పాఠశాలల్లో తరగతి గదులు, ప్రహరీలు, కరెంటు సౌకర్యం కల్పించారు. కానీ మరుగుదొడ్ల సమస్యను మాత్రం పట్టించుకోవడం లేదు.

వేధిస్తున్న స్కావెంజర్ల కొరత..

మండల వ్యాప్తంగా 54 పాఠశాలలు ఉండగా ఏ ఒక్క పాఠశాలలోనూ స్కావెంజర్లు లేరు. పాఠశాలల్లో మరుగుదొడ్లు శుభ్రం చేయడంతోపాటు తరగతి గదులను శుభ్రం చేయడానికి స్కావెంజర్ల అవసరం ఎంతో ఉంటుంది. కానీ వారు లేకపోవడంతో పాఠశాలల్లో అపరిశుభ్ర వాతావరణం నెలకొంటుంది. దీంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొన్ని పాఠశాలల్లో గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పనులు చేస్తున్నప్పటికీ కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులే ప్రైవేట్‌గా స్వీపర్లను ఏర్పాటు చేసుకొని పనులు చేయిస్తున్నారు. ప్రభుత్వం స్కావెంజర్లను నియమిస్తే కనీసం కొన్ని పాఠశాలల్లో అయినా మరుగుదొడ్లు వినియోగంలోకి వస్తాయని ఉపాధ్యాయులు అంటున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



పాఠశాలల్లో మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలని ఇప్పటికే ఎన్నోసార్లు అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నాం. అయినా పట్టించుకోవడంలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో చాలా మంది పాఠశాలలకు సెలవుపెడుతున్నారు. అధికారులు స్పందించి మరుగుదొడ్లను వినియోగంలోకి తీసుకురావాలి.

- ముత్యాల శ్రీజ, విద్యార్థిని

వసతులు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో సరైన వసతులు కల్పించాలి. కొన్ని పాఠశాలల్లో మరుగుదొడ్లు, నీటి వసతి లేదు. స్కావెంజర్లు లేక ఇబ్బందులు అవుతున్నాయి. వంటగదులు, వంట ఏజెన్సీలు లేక విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వం సర్కారు బడుల్లో సరైన వసతులు కల్పించినప్పుడే విద్యార్థులు అధిక సంఖ్యలో హాజరై ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయి.

- వత్సవాయి లలిత, ఎంవీఎఫ్ ఆర్గనైజర్

పనులు వేగవంతంగా పూర్తి చేయాలి

- ఎమ్మెల్యే మందుల సామేల్


మాట్లాడుతున్న మందుల సామేల్

తిరుమలగిరి : పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని తుంగతుర్తి శాసన సభ్యుడు మందుల సామేల్ అధికారులను ఆదేశించారు. గురువారం తిరుమలగిరిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రోడ్లు, భవనాలు, ఇరిగేషన్, పంచాయతీరాజ్ అధికారుల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నూతనంగా రోడ్ల మరమ్మతులు, కొత్త రోడ్ల నిర్మాణానికి ఎస్టిమేషన్లు వేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ఐదేళ్ల పాలనలో అన్ని రంగాల్లో అభివృద్ధి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీనర్సయ్యయాదవ్

అర్వపల్లి : ఐదేళ్ల పాలనలో మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని ఎంపీపీ మన్నె రేణుకలక్ష్మీ నర్సయ్యయాదవ్, జెడ్పీటీసీ దావుల వీరప్రసాద్ యాదవ్ అన్నారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన చివరి విడత మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ ఐదేళ్లలో మండలంలో అపరిష్కృతంగా ఉన్న అనేక సమస్యలను పరిష్కరించినట్లు చెప్పారు. జెడ్పీటీసీ మాట్లాడుతూ ఎస్సారెస్పీ కాలువలు చెత్త, వ్యర్థాలతో నింపుతున్నారని.. ఇలా అయితే గోదావరి జలాలు కాలువల్లో ఎక్కడికక్కడ నిలిచిపోతాయని చెప్పారు. ఎస్సారెస్పీ కాలువల వెంట అక్రమంగా టిప్పర్లలో మూసీనదికి మొరాన్ని తరలిస్తున్నారని తెలిపారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. వర్షాలు పడి ఎస్సారెస్పీ ప్రాజెక్టు నిండితేనే గోదావరి జలాలు ఈ సీజనలో వస్తాయని, లేనిచో ఈ నీళ్లు రావడం కష్టమని ఆ శాఖ అధికారులు చెప్పారు. గతంలో గృహజ్యోతి పథకం వర్తించని వారు దరఖాస్తు చేసుకోవాలని విద్యుత్ అధికారులు సూచించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ మారిపెద్ది భవాణిశ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ సందీప్‌కుమార్, డీఈఈ పిచ్చయ్య, ఎంఈఓ బాలు నాయక్, ఏఓ శశిధర్‌రెడ్డి, ఏఈలు అశోక్, మహేష్, గిరిబాబు, హరిస్వరూప్, డాక్టర్లు మణిదీప్, అర్జున్, ఏపీఎం మల్లేష్, ఏపీఓ ఉపేందర్, స్రవంతి, వార్డెన్ రామానుజాచార్యులు, సీనియర్ అసిస్టెంట్ జలంధర్‌రావు, నవీన్, ఎంపీటీసీ సభ్యులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐకేఎంఎస్ నాయకులు

ఆత్మకూర్(ఎస్) : పంట కాలం ప్రారంభమైనా రాష్ట్ర ప్రభుత్వం పంటల ప్రణాళిక ప్రకటించలేదని, ఇది సర్కార్ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనం అని ఐఎఫ్‌టీయూ(ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్) జిల్లా కార్యదర్శి గంటా నాగయ్య అన్నారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. ఒక వైపు రుతుపవనాలు తరుముకొస్తుంటే విత్తనాల కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. రబీ ధాన్యం రోడ్లపైనే వానలకు తడిసి మొలకెత్తుతుందని తెలిపారు. రైతులకు అందవలసిన రైతుబంధు, రుణమాఫీ, బోనస్‌లు బోగస్ వాగ్దానాలుగానే మిగిలిపోయాయని అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వెంకటకృష్ణ, సామా నర్సిరెడ్డి, బొల్లె వెంకన్న, సంజీవరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కంచర్ల నర్సక్క, పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు నల్లగొండ నాగయ్య, వీరానాయక్, సంఘం వీరయ్య, కొరివి అంజయ్య, బత్తుల వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

తాపీ మేస్త్రీలకు అండగా భారతి సిమెంట్

అర్వపల్లి : తాపీ మేస్త్రీలకు భారతి సిమెంట్ అండగా ఉంటుందని భారతి సిమెంట్ ఏరియా సేల్స్ ఇన్‌చార్జ్ రజనీకాంత్ చెప్పారు. మండల పరిధిలోని తిమ్మాపురంలో గురువారం భువన సిమెంట్ దుకాణంలో తాపీ మేస్త్రీల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది తాపీ మేస్త్రీలకు ఒక్కొక్కరికి రూ.లక్ష ఉచిత ప్రమాద బీమా బాండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రజనీకాంత్ మాట్లాడారు. సిమెంట్ వ్యాపారంలో తిరుగులేని సంస్థగా ఎదుగుతున్న భారతి సిమెంట్ ఆల్ట్రాఫాస్టు పేరుతో ఫాస్ట్ సెట్టింగ్ సిమెంట్‌ను తెలంగాణలో విడుదల చేసినట్లు చెప్పారు. భారతి సిమెంట్ ఇతర సిమెంట్లతో పోలిస్తే మూడురెట్లు మెరుగైందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ ఇంజనీర్ సాగర్‌రెడ్డి, డీలర్ దిలీప్‌రెడ్డి, తాపీ మేస్త్రీలు పాల్గొన్నారు.



తిమ్మాపురంలో తాపీ మేస్త్రీలకు బీమా బాండ్లను పంపిణీ చేస్తున్న కంపెనీ అధికారి రజనీకాంత్

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య


తిరుమలగిరి : తాటిపాములలో పాఠ్య పుస్తకాలు అందజేస్తున్న మండల విద్యాధికారి శాంతయ్య


తిరుమలగిరి : తొండ పాఠశాలలో యూనిఫామ్, పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ స్నేహలత

తిరుమలగిరి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని మండల విద్యాధికారి ఐ.శాంతయ్య అన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా గురువారం తాటిపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో శిక్షణ పొందిన ఉపాధ్యాయులు ఉంటారని, ప్రభుత్వం ఉచితంగా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు అందిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వర్లు, ఎంపీఓ మారయ్య, ఏపీఎం సైదయ్య, కార్యదర్శి రాజు, చైర్మన్ సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలి

బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత కోరారు. తొండ గ్రామంలో గురువారం బడి బాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్ అందజేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, పంచాయతీ అధికారి మారయ్య, పాఠశాల కమిటీ చైర్మన్ మంజుల, హెచ్‌ఎం కె.అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు, మురళి, మల్లికార్జున్ గౌడ్ పాల్గొన్నారు.

హరితహారం పనుల పరిశీలన

అర్వపల్లి : హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటేందుకు గుంతలు తీసే పనులు అర్వపల్లిలో చురుకుగా జరుగుతున్నాయి. గురువారం మొత్తం 500 గుంతలను తీసినట్లు ఉపాధిహామీ పథకం అధికారులు తెలిపారు. గుంతలు తీసే పనులను ఈసీ నగేష్, టీఏ దీపిక పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మల్లయ్య, మేట్లు తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లిలో గుంతలు తవ్వే పనులను పరిశీలిస్తున్న ఈసీ నగేష్

ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ


నాగారంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శ్రీనివాస్

నాగారం : మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి శుక్రవారం నుంచి సామాజిక తనిఖీ నిర్వహించి గ్రామ సభలు ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీడీఓ ధార శ్రీనివాస్ తెలిపారు. మూడో విడత సామాజిక తనిఖీ (2023–24)లో భాగంగా బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పూడికతీత, చెరువుల పునరుద్ధరణ, హరితహారం, నర్సరీలు, అంతర్గత రోడ్ల నిర్మాణం తదితర పనులను, పనిచేసిన కూలీల వివరాలను తెలుసుకోనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ పిట్టల రవి, ఈసీ ముక్కంటి, ఎస్ఆర్‌పీ సాంబయ్య, టీఏలు రాంనరేష్, సురేష్, డీఆర్పీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలపై అవగాహన


సూర్యాపేట : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ



తిరుమలగిరిలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయరాములు


అర్వపల్లిలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ చరణ్


నూతనకల్ : మాట్లాడుతున్న ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి

సూర్యాపేట : సీజనల్ వ్యాధుల నుంచి మనకు మనమే రక్షించుకోవాలని మున్సిపల్ చైర్ పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా సూర్యాపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పట్టణ ప్రజల ఆరోగ్యాన్ని కాపాడడంలో మున్సిపాలిటీ శానిటేషన్ సిబ్బంది, ఆర్పీల బాధ్యత ప్రధానమైందన్నారు. రాబోయే వర్షాలను దృష్టిలో ఉంచుకొని మన ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ప్రతి శుక్రవారం డ్రైడేగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, టీఎంసీ శ్వేత, హెల్త్ అసిస్టెంట్ సురేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి : వర్షా కాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ రాములు, ఎంపీపీ నెమురుగొమ్ముల స్నేహలత అన్నారు. వర్షా కాలంలో వచ్చే అంటు వ్యాధులను అరికట్టే అంశంపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామాల్లో, మున్సిపాలిటీ వార్డుల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని, మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, ఎంపీఓ మారయ్య, వైద్యాధికారి వందన, సీహెచ్‌ఓ బిచ్చు నాయక్, వార్డు ఆఫీసర్లు, ఏఎన్‌ఎంలు, సమభావన సంఘం ప్రతినిధులు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలను అప్రమత్తం చేయాలి

అర్వపల్లి : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను సిబ్బంది అప్రమత్తం చేయాలని ఎంపీడీఓ డి.సందీప్‌కుమార్, మండల వైద్యాధికారి డాక్టర్ సీహెచ్.మణిదీప్ కోరారు. గురువారం అర్వపల్లిలో గ్రామ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైనందున వచ్చే వ్యాధులు–ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సీహెచ్‌ఓ. చరణ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వలిశెట్టి మల్లేష్, ఏఈలు అశోక్, మహేష్, సీసీలు పద్మావతి, నగేష్, మండల పశువైద్యాధికారి అర్జున్, వివిధ శాఖల సిబ్బంది, కార్యదర్శులు, వీఓఏలు, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నుంచి రక్షించుకోవాలి

నూతనకల్ : గ్రామాల్లో సీజనల్ వ్యాధుల నుంచి ప్రతిఒక్కరూ తమను తాము రక్షించుకోవాలని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, జెడ్పీటీసీ కందాల దామోదర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. వర్షాకాలంలో వీధులతో పాటు ఖాళీ ప్రదేశాల్లో మురుగు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పన్నాల రమమల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, మండల వైద్యాధికారి ఆశ్రితారెడ్డి, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రండి.. మా బడికే రండి !

- గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పోటాపోటీ ప్రచారం


తిరుమలగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

తిరుమలగిరి : మొన్నటి వరకు ఎన్నికల ప్రచారంతో హోరెత్తిన గ్రామాల్లో ఇప్పుడు విద్యా సంస్థల ప్రచారం జోరుగా సాగుతోంది. మా పాఠశాలలో చేర్పించాలని ప్రభుత్వ ఉపాధ్యాయులు ఒకవైపు, తమ స్కూల్‌లో చేర్పించాలని ప్రైవేట్ ఉపాధ్యాయులు మరొక వైపు కొన్ని రోజులుగా పోటా పోటీగా ప్రచారం చేస్తున్నారు.

అన్ని ఉచితం అంటున్న ప్రభుత్వ బడి..

ప్రభుత్వ పాఠశాలల్లో చేరిస్తే అన్నీ ఉచితం అంటూ ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రచారం నిర్వహిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్‌సార్ బడి బాట కార్యక్రమాన్ని జూన్ 6 నుంచి 19 వరకు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లోనే తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులను కోరుతున్నారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం, 2 జతల యూనిఫామ్, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్, ఇతర సౌకర్యాలు ఉచితంగా ప్రభుత్వ పాఠశాలల్లోనే అందుతున్నాయని తెలుపుతున్నారు. ప్రైవేట్ పాఠశాలలు అయితే స్కూల్ ఫీజ్, బస్ ఫీజు, పుస్తకాలు, యూనిఫామ్స్, ఇతర కార్యక్రమాలకు అదనంగా డబ్బులు ఖర్చు చేయాల్సి ఉంటుందని చెబుతున్నారు. దీంతో పాటు ఈ సంవత్సరం పదవ తరగతిలో తమ విద్యార్థులు సాధించిన ర్యాంకులతో కరపత్రాలు ముద్రించి ప్రైవేట్‌కు దీటుగా ప్రచారం నిర్వహిస్తున్నారు.

అన్ని ర్యాంకులు మావే అంటున్న ప్రైవేట్ విద్యా సంస్థలు..

నర్సరీ నుంచి పదవ తరగతి వరకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తామని, పదవ తరగతిలో అత్యధిక ర్యాంకులు మా పాఠశాలకే ఎక్కువ వస్తాయని ప్రైవేట్ పాఠశాలల సిబ్బంది ప్రచారం నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం చేపట్టిన బడి బాట కార్యక్రమానికి 15 రోజుల ముందు నుంచే ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యం తమ సిబ్బందితో గ్రామాలలో తిరుగుతున్నారు. బస్సులలో గ్రామాలకు చేరుకొని ఉదయం 7 గంటల నుంచే ప్రచారం నిర్వహిస్తున్నారు. తమ విద్యార్థులు పదవ తరగతిలో సాధించిన ర్యాంకులతో ఉన్న కర పత్రాలను పంచుతున్నారు. తమ విద్యా సంస్థల్లో ఎలాంటి సౌకర్యాలు ఉన్నాయి.. ఎలా బోధిస్తున్నారో వివరిస్తూ ప్రచారం నిర్వహిస్తున్నారు.

ప్రైవేట్ వైపే మొగ్గు..

ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఎన్ని చెప్పినా కొందరు విద్యార్థుల తల్లిదండ్రులు మాత్రం ప్రైవేట్ విద్యా సంస్థల వైపే మొగ్గు చూపుతున్నట్లు తెలుస్తోంది. ప్రైవేట్‌లో చదివిస్తే తమ పిల్లలు ఇంగ్లిష్‌లో మాట్లాడుతారని, మంచి ర్యాంకులు వస్తాయనే భావనతో పిల్లల తల్లిదండ్రులు ఉంటున్నట్లు సమాచారం.

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచితంగా నాణ్యమైన విద్య, మధ్యాహ్న భోజనం, యూనిఫామ్, నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందుతాయి. ఎలాంటి ఖర్చు లేకుండా విద్యా బోధన అందుతుంది.

- ఐ.శాంతయ్య, మండల విద్యాధికారి

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కోదాడరూరల్ : కోదాడ మండల పరిధిలోని గణపవరంలో గతంలో రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్ నిధుల నుంచి మంజూరైన రూ.25 లక్షలతో గురువారం సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు, మాజీ సర్పంచ్ పొట్టా శ్రీవిజయకిరణ్ మాట్లాడారు. ఎంపీ నిధులతో గ్రామంలోని పలు మట్టి రోడ్లను సీసీలుగా మారుస్తున్నట్లు తెలిపారు. నిధులు కేటాయించిన బడుగుల లింగయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు ముడియాల వెంకట్‌రెడ్డి, కొలిశెట్టి వెంకన్న, జంగం తిరపతయ్య, శెట్టి శంకర్‌రావు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న నాయకులు

మృతుల కుటుంబానికి ఆర్థికసాయం అందజేత


నాగారంలో సుధాకర్ కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న వైస్‌ఎంపీపీ మణిమాల


పెన్‌పహాడ్ : నివాళులర్పిస్తున్న ఎల్ఐసీ ఆఫీసర్ మేకల వెంకన్న, ఎల్ఐసీ ఏజెంట్లు

నాగారం : నాగారం మండల కేంద్రానికి చెందిన తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుడు చిప్పలపల్లి సుధాకర్ (డప్పు సుధాకర్) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. ఈ సందర్భంగా స్థానిక వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల గురువారం మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కూరం మణివెంకన్న, బీఆర్ఎస్ నాయకులు గుండగాని అంబయ్యగౌడ్, ఎల్క సైదులు, చిప్పలపల్లి సోమయ్య, కన్నెబోయిన భద్రయ్య, చిప్పలపల్లి మల్లయ్య, ఎల్లయ్య, దేవరకొండ మురళి, పరశురాములు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని అనంతారం గ్రామానికి చెందిన ఐతరాజు చెన్నయ్య ఇటీవల మృతి చెందాడు. దీంతో గురువారం మండల కేంద్రంలోని సత్యగార్డెన్స్‌లో నిర్వహించిన సంతాప సభలో ఎల్ఐసీ ఏజెంట్లు పాల్గొని మృతుడి కుటుంబానికి రూ. 34వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మేక వెంకన్న, గజ్జెల వెంకట్‌రెడ్డి, గుమ్మడవెల్లి శ్రీను, గుజ్జ రవీందర్, రేసు శ్రీనివాస్, మద్దెల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.